సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం | 3 | నవంబర్ | 2024



కిలో టమాట రూ.30

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.16, సరాసరిన రూ.23 ప్రకారం ధర పలికింది.



బియ్యం పేరుతో యూరియా

సన్న బియ్యం పేరుతో కొందరు కేటుగాళ్లు యూరియా అంటగట్టే ప్రయత్నం చేశారు. గోరంట్లలో చోటుచేసుకున్న ఈ ఘటన కలకలం రేపింది.

8లో

గరిష్టం/కనిష్టం
35.2°/ 19.5°

జిల్లా పరిధిలో శనివారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జనవరి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి

- కలెక్టర్ టీఎస్ చేతన్



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్ చేతన్, ఎమ్మెల్యే సింధూరారెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లాలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్నామని, రానున్న జనవరి నాటికి పనులన్నీ పూర్తి చేస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక ఎమ్మెల్యే సింధూరారెడ్డితో కలిసి కొత్తచెరువులో పర్యటించారు. ఈ సందర్భంగా తలమర్ల – తిప్పాబాట్లపల్లి రోడ్డుకు రూ.25 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులకు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లాలో 2441.289 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నట్లు గుర్తించామని, తొలి విడతలో రూ.6 కోట్లతో ఆయా రోడ్లకు మరమ్మతులు పనులు ప్రారంభించామన్నారు. జనవరి 31వ తేదీలోపు రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, తహసీల్దార్ నీలకంఠారెడ్డి, ఇంజినీర్ వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



అఖిల

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బి. అఖిల జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. అక్టోబర్ 5 నుంచి 7 వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఏపీ స్కూల్ గేమ్స్ అండర్–17 ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అఖిల అద్భుత ప్రదర్శన చేసింది. దీంతో అఖిలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీ మారుతీప్రసాద్ తెలిపారు. ఈనెల 26 నుంచి 30 వరకు జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో అఖిల పాల్గొననుంది.

బతకలేక బలవన్మరణం!

2024 జూన్ 14
సోమందేపల్లికి చెందిన చేనేత కార్మికుడు మారుతి కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక...కుటుంబ పోషణ భారమై జీవితంపై విరక్తి చెందాడు. ఇంటి పైకప్పునకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

2024 జూలై 18
కర్ణాటక రాష్ట్రం టీబీ క్రాస్‌కు చెందిన శ్రీనివాసులుకు ఓడీచెరువుకు చెందిన బోయ శివమ్మతో వివాహమైంది. వివాహం తర్వాత అతను ఓడీచెరువుకు ఇల్లరికం వచ్చారు. కొద్ది రోజులు అన్యోన్యంగా సాగిన వారి సంసారంలో కలహాలు వచ్చాయి. అవి కాస్త పెద్దవిగా మారడంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీనివాసులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

2024 సెప్టెంబర్ 26
చిలమత్తూరుకు చెందిన లక్ష్మీనారాయణ(55) అనారోగ్యంతో ఉన్న భార్యకు ఆపరేషన్ చేయించే ఆర్థిక స్తోమత లేక మనస్తాపం చెందాడు. తన పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

2024 సెప్టెంబర్ 30
చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురానికి చెందిన నాగేంద్ర(43) తన మూడు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పెట్టుబడుల కోసం రూ.3 లక్షలు అప్పు చేయగా.. ప్రకృతి వైపరీత్యంతో పంటలు చేతికందకుండా పోయాయి. అప్పులు తీర్చే మార్గం కనిపించక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జిల్లాలో పెరిగిన ఆత్మహత్యలు

- కుటుంబ కలహాలు.. ఆర్థిక ఇబ్బందులతోనే ఘాతుకాలు
- ప్రేమ విఫలమై ప్రాణాలు తీసుకుంటున్న యువత
- అన్ని సమస్యలకూ చావే పరిష్కారంగా భావిస్తున్న వైనం

478 గత 10 నెలల్లో చోటుచేసుకున్న ఆత్మహత్య ఘటనల సంఖ్య
252 ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన వారి సంఖ్య
226 ఆత్మహత్యాయత్నం చేసి ప్రాణాలతో బయటపడిన వారి సంఖ్య

పుట్టపర్తి టౌన్: ప్రేమ విఫలమైందని, ఆర్థిక ఇబ్బందులున్నాయని, అమ్మ తిట్టిందని, నాన్న కొట్టాడని, మార్కులు తక్కువ వచ్చాయని...ఇలా చిన్న చిన్న సమస్యలకే చాలా మంది బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుంటూ కుటుంబీకులకు శోకాన్ని మిగులుస్తున్నారు. జిల్లాలో ఇటీవల ఆత్మహత్య కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

జీవితంపై విరక్తి చెంది..

ఆత్మహత్యలు చేసుకొన్న వారిలో చాలా మంది కుటుంబ కలహాలు, అనారోగ్య కారణాల వల్ల ప్రాణాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దాంపత్య జీవితంలో ఇమడలేక ఇటీవల ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. యువతుల్లో చాలా మంది వివాహ బంధంలో ఇబ్బందులు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తూ విఫలమవుతున్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది.. అన్ని సమస్యలకు చావునే పరిష్కారంగా భావిస్తున్నారు. ఇంకొన్ని కేసుల్లో వివాహమై పదేళ్ల తర్వాత కూడా దాంపత్య జీవితం సరిగా లేకపోవడంతో ఇంకెందుకీ జీవితం అనుకుని పలువురు పురుషులూ ఆత్మహత్యలకు తెగిస్తున్నారు. ఇక మార్కులు తక్కువ వచ్చాయని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయన్న కారణంతోనూ బలవన్మరణం పొందుతున్న వారూ ఉన్నారు.

మానసిక ఒత్తిడితోనే...

బలమైన కారణం లేకుండానే చాలా మంది ఆత్మహత్యలకు తెగిస్తున్నారని మానసిక వైద్యులు చెబుతున్నారు. బాగా మానసిక ఒత్తిడికి లోనైనప్పుడు, చిన్నచిన్న సమస్యలకే చికాకు చెంది వాటికి పరిష్కారం లభించనప్పుడు... సమస్య నుంచి ఎలా బయటపడాలో తెలియక ఆత్మహత్యకు పాల్పడుతున్నారని వారు చెబుతున్నారు. మానసిక రుగ్మతలూ ఆత్మహత్యలకు పురిగొల్పుతాయంటున్నారు. మత్తుకు బానిసలైన వారు బతికేందుకు భయపడి క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

కుటుంబ సభ్యుల పాత్ర కీలకం..

ఆత్మహత్యల నివారణకు ముఖ్యంగా కుటుంబ సభ్యుల పాత్ర కీలకం. నిరాశతో ఉన్న వారిని గమనిస్తూ ఉండాలి. వారిన దగ్గరకు తీసుకొని ఆత్మీయంగా ఓదార్చాలి. నేనున్నానంటూ భరోసా కల్పించాలి. సమస్య పరిష్కారానికి సూచనలు ఇవ్వాలి. కష్టాన్ని ఎలా ఎదుర్కోవాలో వారికి నేర్పాలి. విద్యార్థులైతే బాల్యం నుంచే వారిలో మనోధైర్యం నింపాలి. అప్పుడే ఆత్మహత్యలను నివారించవచ్చని మానసిక వైద్యులు చెబుతున్నారు.

మహిళలే అధికం..

ఈ ఏడాది ఆరంభం నుంచి అక్టోబర్ చివరి వరకు 478 మంది ఆత్మహత్యాయత్నం చేశారు. ఇందులో 226 మంది ప్రాణాలతో బయటపడగా, 252 మంది తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో పురుషుల కంటే మహిళలే అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఆత్మహత్య చేసుకున్న వారిలో 57 శాతం మహిళలు ఉండగా, 43 శాతం పురుషులు ఉన్నారు. అందులో 40 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు 69 శాతం ఉండగా, 40 ఏళ్లకుపైబడిన వారు 31 శాతం ఉన్నారు.



జిల్లా వ్యాప్తంగా ఆత్మహత్యల ఘటనలు ఇలా..	
ఎప్పడి నుంచి ఎప్పటి వరకు	సంఖ్య
జనవరి 1 నుంచి మార్చి 31 వరకు	89
ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు	84
జూలై 1 నుంచి అక్టోబర్ 30 వరకు	79

ఆత్మహత్య పరిష్కారం కాదు



ఎవరైనా సరే నెగిటివ్ ఆలోచనలకు దూరంగా ఉండాలి. పాజిటివ్ దృక్పథంతో జీవితాన్ని ఆస్వాదించాలి. ఆలోచిస్తే ఏ సమస్యకైనా పరిష్కారం దొరుకుతుంది. సహనం ఉంటే వందేళ్ల జీవితాన్ని అర్థవంతంగా జీవించవచ్చు. అర్థాంతరంగా తనువు చాలించడం పిరికి వాళ్ల పని. ప్రేమ, పెళ్లి అనేవి మాత్రమే జీవితం కాదన్నది గుర్తించాలి. ఏదైనా సమస్య వస్తే కుటుంబీకులతో మనసు విప్పి మాట్లాడితే తప్పక పరిష్కారం దొరుకుతుంది. పోలీసు శాఖ తరపున కూడా ఇలాంటి వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

– రత్న, ఎస్పీ

ప్రగతి నివేదికలు సిద్ధం చేయండి

- రేపు జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం
- హాజరుకానున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్
- అధికారులతో కలెక్టర్ టీఎస్ చేతన్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం ఈనెల 4వ తేదీ (సోమవారం) కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విచ్చేస్తున్నారని, అందువల్ల అధికారులంతా తమ శాఖల పరిధిలో జరిగిన ప్రగతిపై నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని 'మీకోసం' సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమావేశం నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ తొలిసారిగా జిల్లాకు వస్తున్నారని, అధికారులు ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. గత ఐదు నెలల కాలంలో జరిగిన అభివృద్ధికి సంబంధించిన పూర్తి నివేదికలను అన్ని శాఖల అధికారులు సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులందరినీ సమావేశానికి ఆహ్వానించాలన్నారు. అలాగే గత ఆగస్టు నెలలో జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీల అమలు, వివిధ శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు నివేదికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ విజయసారథి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, సీపీఓ విజయ్‌కుమార్, అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్కేయూ తైక్వాండో జట్టు ఎంపిక

అనంతపురం: ఆలిండియా యూనివర్సిటీస్ స్థాయిలో నిర్వహిస్తున్న తైక్వాండో (మెన్) పోటీలకు ఎస్కేయూ తైక్వాండో జట్టును ఎంపిక చేశారు. గురునానక్ దేవ్ యూనివర్సిటీ, అమృత్‌సర్‌లో నవంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు తైక్వాండో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఆది ఆంధ్రా ధీరజ్ (బీపీఈడీ, నారాయణ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్), రెడ్డి మణిదీప్ (బీఎస్సీ), వై. మోక్షిత్ రామ్ (బీఎస్సీ ఎస్ఎస్‌బీఎన్ కళాశాల) ఎంపికైన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా శనివారం ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ బి. జెస్సీ వారిని అభినందించారు.

పది రోజులైనా పలుకులేదు!



కనగానపల్లి చెరువుకట్ట తెగి నీటి ప్రవాహానికి ఒరిగిపోయిన వరి మడి (ఫైల్)



ముక్తాపురం చెరువు కట్టకింద నీటి కోతకు గురైన కంది పంట (ఫైల్)

- భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలు
- కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల్లో తీవ్ర నష్టం
- కనగానపల్లి చెరువు కట్ట తెగి కొట్టుకుపోయిన వరిమడులు
- 10 రోజులు దాటినా పరిహారం ప్రకటించని అధికారులు

కనగానపల్లి: ఖరీఫ్ సీజన్‌లో కీలకమైన సమయంలో వరుణుడు ముఖం చాటేయడంతో చాలా మంది రైతులు పంటలు సాగు చేయలేకపోయారు. నీటి సౌకర్యం ఉన్న కొందరు బోర్ల కింద, చెరువు ఆయకట్టులో పంటలు వేశారు. ఆరుగాలం కుటుంబంతో సహా శ్రమించి పంటలు కాపాడుకున్నారు. తీరా పంట చేతికందే సమయంలో వరుణుడు ప్రతాపం చూపాడు. దీంతో పంటలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఆదుకోవాల్సిన పాలకులు నేటికీ పరిహారం మాటెత్తడం లేదు. అధికారులూ నివేదికలు సిద్ధం చేయలేదు. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోలుకోలేని దెబ్బతీసిన వాన..

అక్టోబర్ 21వ తేదీ రాత్రి రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి భారీ వర్షం కురిసింది. ఎప్పుడు లేనంతగా కనగానపల్లి మండలంలో ఏకంగా 198 మి.మీ, రామగిరిలో 98 మి.మీ. చెన్నేకొత్తపల్లిలో 95 మి.మీ వర్ష పాతం నమోదైంది. దీంతో కనగానపల్లిలోని చెరువుకట్ట తెగిపోవటంతో పాటు పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. వరద నీరు పొలాలను ముంచెత్తడంతో పంటలన్నీ దెబ్బతిన్నాయి.

పంటలన్నీ నీటి మునక..

భారీ వర్షంతో కనగానపల్లిలోని చెరువు కట్ట తెగిపోవటంతో ఆయకట్టు కింద ఉన్న 80 ఎకరాల్లోని వరిమడులు నీటి మునిగాయి. అంతేకాకుండా 30 ఎకరాల్లో పంట కొట్టుకుపోయింది. ఇక ముక్తాపురం చెరువు నిండి మరవ పారడంతో వందల ఎకరాల్లో వరి మడులు, వేరుశనగ, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దాదులూరు, కుర్లపల్లి, చంద్రాచర్ల, కోనాపురం గ్రామాల్లో కొన్ని పంటలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. రామగిరి మండలంలోని పోలేపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి ప్రాంతాల్లో కోతకోసిన పంటలు కూడా నీటిలో కొట్టుకుపోయాయి. చెన్నేకొత్తపల్లి మండలంలో హరియాన్ చెరువు, వెల్దుర్తి గ్రామాల్లో వంద ఎకరాల్లో వరిమడులు నీట మునిగాయి. దీంతో రైతులకు పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేకుండా పోయింది.

పట్టించుకోని అధికారులు..

భారీ వర్షం కురిసి పంట నష్టం జరిగి 10 రోజులు దాటినా రెవెన్యూ, వ్యవసాయాధికారులు పరిహారం గురించి ఇప్పటికీ నివేదించలేదని రైతులు వాపోతున్నారు. భారీ వర్షం కురిసిన తర్వాత రెండోరోజు కలెక్టర్ టీఎస్ చేతన్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కనగానపల్లిలో పర్యటించారు. వర్షపునీటికి తెగిన చెరువు కట్టను పరిశీలించడంతో పాటు అక్కడే దెబ్బతిన్న కొన్ని పంటలను కూడా పరిశీలించారు. అయితే చెరువు కట్ట మరమ్మతు పనులు గురించి మాట్లాడిన కలెక్టర్, ఎమ్మెల్యే... పంట నష్ట పరిహారం గురించి మాత్రం మాట్లాడలేదని రైతులు చెబుతున్నారు. గత నెలలో విజయవాడలో వరదలు వస్తే వెంటనే పరిహారాన్ని ప్రకటించారని, ఇక్కడి రైతుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదని రైతు సంఘం నాయకులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు విమర్శిస్తున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



భారీ వర్షానికి ముక్తాపురం చెరువు ఒకేసారి నిండి మరవ పారడంతో పంటలు దెబ్బతిన్నాయి. ముక్తాపురం చెరువు కట్టకింద నేను సాగు చేసిన 5 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. దీంతో పాటు కూరగాయల పంటలు కూడా చాలా దెబ్బతిన్నాయి. ఇంతవరకూ ఏ ఒక్క అధికారి గానీ, ప్రజాప్రతినిధి గానీ దెబ్బతిన్న పంటలను పరిశీలించలేదు. పంట నష్ట పరిహారం గురించి కూడా మాట్లాడలేదు.

– లక్ష్మిరెడ్డి, రైతు, ముక్తాపురం గ్రామం, కనగానపల్లి మండలం

వెంటనే పరిహారం అందించాలి



భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలి. కానీ రెవెన్యూ, వ్యవసాయాధికారులు ఇంతవరకు పంట నష్టం ఎంత జరిగింది అనే విషయం కూడా చెప్పటం లేదు. జిల్లా అధికారులు కనగానపల్లిలో మాత్రం పర్యటించి వెళ్లారు గానీ, పంటలు దెబ్బతిన్న రైతుల గురించి మాత్రం మాట్లాడటం లేదు. నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించకపోతే ఆందోళనలు నిర్వహిస్తాం.

– కదిరప్ప, జిల్లా రైతు సంఘం నాయకుడు, కనగానపల్లి మండలం

నివేదికలు పంపుతున్నాం

భారీ వర్షానికి దెబ్బతిన్న పంటల వివరాలను స్థానిక రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది ద్వారా తీసుకొని ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం. కొన్ని గ్రామాల నుంచి ఇంకా సరైన వివరాలు అందలేదు. ప్రభుత్వం నుంచి రైతులకు పంట నష్ట పరిహారం రావాలంటే కొంత ఆలస్యమవుతుంది. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చూస్తాం.

– కృష్ణయ్య, ఏడీఏ, ధర్మవరం డివిజన్

'తమ్ముళ్ల' ముష్టియుద్ధం

- కొత్తచెరువులో బాహాబాహీకి దిగిన రెండు వర్గాలు
- ఎమ్మెల్యే సింధూరారెడ్డి ఎదుటే కట్టెలతో కొట్టుకొన్న వైనం
- పలువురికి గాయాలు.. పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు



సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలుగు తమ్ముళ్ల మధ్య ఆధిపత్య పోరు ఎక్కువైంది. తమ పబ్బం గడుపుకునేందుకు ముఖ్యనేతలు కూడా ఇరువర్గాలనూ ప్రోత్సహించడంతో ఎవరికి వారు తాము చెప్పిందే నడవాలన్నట్లు వ్యవహరిస్తూ అందరినీ ఇబ్బందులు పెడుతున్నారు. అయితే తమ్ముళ్ల ఆధిపత్య పోరు ఒక్కోసారి పార్టీ ముఖ్య నేతలనే తిప్పలు పెడుతోంది. తాజాగా శనివారం కొత్తచెరువులో చోటుచేసుకున్న ఈ సంఘటనే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. కొత్తచెరువు మండలం తిప్పబాట్లపల్లి గ్రామం సమీపంలో రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభించేందుకు ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి వచ్చారు. కార్యక్రమానికి టీడీపీ స్థానిక నాయకులూ హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఎమ్మెల్యేను సప్లయర్స్ ఆదినారాయణ తన ఇంటికి ఆహ్వానించగా, వెంకటేష్ వర్గం అభ్యంతరం తెలిపింది. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గొడవ కాస్త పెద్దది కావడంతో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే సమక్షంలోనే తమ్ముళ్లు ముష్టియుద్ధానికి దిగారు. కట్టెలతో కొట్టుకోవడంతో వెంకటేష్ వర్గానికి చెందిన వారు ఎక్కువ మంది గాయపడ్డారు. దీంతో వారిని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గతంలో ఎన్నికల ప్రచారంలోనూ ఈ రెండు వర్గాల మధ్య గొడవలు జరిగి కేసుల వరకూ వెళ్లారు. తాజాగా భౌతికదాడులకు దిగారు. ఈ ఘర్షణతో ఎమ్మెల్యే వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోగా.. మాజీమంత్రి పల్లె ఇరువర్గాలకు సర్దిచెప్పి రాజీ చేసినట్లు తెలుస్తోంది.

సాయి బోధన.. సన్మార్గానికి సోపానం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న సత్యసాయి యూత్



సంజీవని నాటికలోని ఓ ఘట్టం



చిన్నారులకు ప్రసాదం అందిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: సత్యసాయి బోధనలు సన్మార్గానికి సోపానాలని సత్యసాయి యూత్ చాటిచెప్పారు. సత్యసాయి బోధించిన తొమ్మిది సూత్రాలు మానవాళి సన్మార్గంలో పయనించేందుకు ఎంతగానో ఉపకరిస్తాయని నాటిక ద్వారా ప్రదర్శించారు. ప్రశాంతి నిలయంలో జరుగుతున్న గుజరాత్ నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా చివరి రోజు శనివారం ఉదయం గాంధీ నగర్‌కు చెందిన సత్యసాయి యూత్ సభ్యులు సంగీత కచేరీ నిర్వహించారు. గుజరాతీ జానపద గీతాలను చక్కటి స్వరాలతో ఆలపిస్తూ సత్యసాయిని కీర్తించారు. సాయంత్రం 'సంజీవని' పేరుతో సత్యసాయి బోధించిన తొమ్మిది సూత్రాలతో కూడిన 'కోడ్ ఆఫ్ కాండక్ట్'ను వివరిస్తూ నాటిక ప్రదర్శించారు. ఆధునిక సమాజంలో మానవులు విలువలు మరచి, ఆధ్యాత్మికతకు దూరంగా జీవితాన్ని దుర్భరం చేసుకుంటున్న తీరును చక్కగా వివరించారు. సత్యసాయి బోధనలను అనుసరిస్తూ ప్రతి ఒక్కరూ తమ జీవితాలను ఆనందమయం చేసుకోవచ్చన్న సందేశంతో ప్రదర్శన ముగించారు.

క్లుప్తంగా

ఈవ్‌టీజర్లపై కేసు


ఈవ్‌టీజర్లను హెచ్చరిస్తున్న ఎస్‌ఐ రమేష్ బాబు

సోమందేపల్లి : మండల కేంద్రం సోమందేపల్లిలోని పాఠశాలల వద్ద ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిది ఆకతాయిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. శనివారం స్టేషన్ ఆవరణలో ఈవ్‌టీజర్లకు డీఎస్పీ వెంకటేశ్వర్లు కౌన్సిలింగ్ ఇచ్చారు. అమ్మాయిలను వేధించినా, పాఠశాలల వద్ద సంచరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలల వద్ద ప్రత్యేక నిఘా ఉంచుతామని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఎస్పీ చెప్పారు. అధిక శబ్దంతో ద్విచక్ర వాహనాలపై తిరిగితే వాహనాలు సీజ్ చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

కదిరి అర్బన్: ముష్టిపల్లి సమీపంలోని పేకాట స్థావరంపై శనివారం కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.1,03,330 నగదు, 13 ద్విచక్రవాహనాలు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తమ దృష్టికి తేవాలని ఎస్‌ఐ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


అంజి (ఫైల్)

ఉరవకొండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. ఉరవకొండ పట్టణానికి చెందిన హమాలీ కేశవుడు కుమారుడు అంజి (23)తో పాటు వారి స్నేహితులు నరసింహ, సాయి శనివారం ద్విచక్రవాహనంపై అనంతపురం బయల్దేరారు. రాములమ్మ గుడి సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొనడంతో అంజి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు స్నేహితులూ గాయపడటంతో వారిని 108వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారిద్దరినీ అక్కడి నుంచి అనంతపురం పంపించారు. ఏఎస్‌ఐ శ్రీశైలం కేసు నమోదు చేసి, అంజి మృతుదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

చేనేత కార్మికుడికి గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు బాబావలిని శనివారం రాత్రి మున్సిపల్ కార్యాలయం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తలకు తీవ్రగాయాలు కావడంతో అతడికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బియ్యం పేరుతో యూరియా

- గోరంట్లలో రెండు బస్తాల యూరియా పట్టివేత
- వాహనం వదిలేసి పరారైన బియ్యం వ్యాపారులు
- మంత్రి ఇలాకాలో భారీ మోసం


బియ్యం బదులు యూరియా తీసుకొచ్చిన వాహనాన్ని గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో ఉంచిన దృశ్యం

సాక్షి, పుట్టపర్తి: పట్టించుకునేవారు లేకపోవడం, పర్యవేక్షణ కరువవడంతో పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా అక్రమార్కులు పలు మోసాలకు పాల్పడుతున్నారు. అదేమని అడిగితే మంత్రి పేరు చెబుతూ ఇష్టారాజ్యంగా ప్రజల నుంచి అక్రమ వసూళ్లు చేస్తున్నారు. ఇక శాంతిభద్రతలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సరిహద్దున కర్ణాటక ఉండటంతో చీప్ లిక్కర్, పేకాట, కోడిపందేలు ఇలా ఒకటేమిటి... అన్నీ యథేచ్ఛగా సాగిపోతున్నాయి. దీనికి తోడు సన్నబియ్యం పేరుతో యూరియా సరఫరా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇలాంటి ఘటన గోరంట్ల మండల కేంద్రంలో వారం రోజుల క్రితం జరగ్గా... ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

సన్నబియ్యం పేరుతో..

ఇంటింటికీ వ్యాపారులు వచ్చి రెండు వాహనాల్లో బియ్యం విక్రయిస్తామని చెబుతారు. మొదటివాహనంలో సన్నబియ్యం బస్తాలు ఉంటాయి. ఇవి కేవలం శాంపిల్ అని, కావాలంటే మరో వాహనంలో వెంటనే తెప్పిస్తామని చెబుతారు. ఎవరైనా ఆసక్తి చూపితే అరగంటలోనే మరో వాహనం ప్రత్యక్షమవుతుంది. అందులో ప్రతి పది బస్తాలకు నాలుగు యూరియా బస్తాలను కలిపేస్తున్నారు. వ్యాపారుల వెంట వచ్చిన కూలీలే ఇంట్లో వరకు బియ్యం బస్తాలు చేరవేస్తుండడంతో చాలామంది మోసపోతున్నారు. యూరియా బస్తాలు అడుగున వేసి.. పైన బియ్యం బస్తాలు వేస్తున్నారు. క్రమక్రమంగా ఇళ్లలో వాడకం మొదలుపెట్టి బియ్యం బస్తాలు పూర్తయిన తర్వాత యూరియా బస్తాలు బయటపడుతుండడంతో కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు.

గోరంట్లలో వెలుగులోకి..

గోరంట్లలో వారం రోజుల క్రితం సన్నబియ్యం పేరుతో యూరియా సరఫరా చేస్తున్న ఘటన బయటపడింది. బియ్యం బస్తాలతో రెండు వాహనాల్లో వ్యాపారులు వచ్చారు. మొదటి వాహనంలోని బస్తాలు ఇవ్వకుండా రెండో వాహనంలోని బస్తాలు మాత్రమే ఇస్తుండటంతో కొందరికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే పోలీసులు అక్కడికి చేరుకునేలోపు వ్యాపారులు పారిపోయారు. వాహనదారులు మాత్రమే పట్టుబడ్డారు. తమకు ఏమీ తెలియదని, కేవలం బాడుగ కోసం వాహనం ఇచ్చినట్లు వారు వాపోతున్నారు.

ఇసుక అక్రమ రవాణా..

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అండ చూసుకుని కూటమి నేతలు బరి తెగించారు. రాత్రింబవళ్లు కర్ణాటకకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ఇంకొన్ని చోట్ల కర్ణాటక మద్యం విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పేకాట, కోడిపందేలు విచ్చలవిడిగా సాగుతున్నట్లు సమాచారం. నెల రోజుల క్రితం పేకాట స్థావరాలపై దాడి చేసి సుమారు రూ.15 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల క్రితం ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేశారు. రొద్దం, పరిగి మండలాల్లోని పెన్నానది నుంచి ఇసుక కొల్లగొడుతుండగా..పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లోని పలు ప్రాంతాలను పేకాట, కర్ణాటక మద్యం విక్రయాలకు అడ్డాగా మార్చుకున్నారు.

సహించేది లేదు

అక్రమ వ్యాపారం ఏదైనా సహించేది లేదు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపాం. ప్రజలను మోసం చేయాలని చూస్తే ఊరుకోం. ఇటీవల గోరంట్ల రాజీవ్ కాలనీలో బియ్యం బదులు యూరియా బస్తాలు దింపి వెళ్లిన వారిని వెంబడించగా పరారయ్యారు. వారి కోసం గాలిస్తున్నాం. వారి వాహనం పట్టుకుని సీజ్ చేశాం. – బోయ శేఖర్, గోరంట్ల సీఐ

వివాహిత హత్య కేసు ఛేదింపు

- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ఓడీచెరువు మండలం కొండకమర్లలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన వివాహిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని తేల్చారు. నిందితుడిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్న మీడియాకు వెల్లడించారు. కొండకమర్ల గ్రామానికి చెందిన అల్లాబకాష్ పెద్ద కుమార్తె మెహతాజ్‌కు 14 ఏళ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన షేక్ బాబ్జాన్‌తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో మెహతాజ్ తన పిల్లలతో వచ్చి పుట్టింటిలో ఉంటోంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్‌తో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుంది. అయితే ఆమె మరొకరితోనూ చనువుగా ఉంటోందని ఇర్ఫాన్ అనుమానించాడు. గత నెల 31వ తేదీ అర్ధరాత్రి 11 గంటల సమయంలో ఆమెకు ఫోన్ చేసి మిద్దెపైకి రప్పించాడు. మరొక వ్యక్తితో చనువుగా ఉన్న విషయంపై ఆమెను నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఇర్ఫాన్ కోపంతో ఆమెను కిందపడేసి కడుపుపై కూర్చుని గొంతు నులిమి, ఊపిరాడకుండా చేసి చంపేశాడు. ఈ నెల ఒకటో తేదీన హతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. శనివారం మధ్యాహ్నం నిందితుడు ఇర్ఫాన్‌ను గాజుకుంటపల్లి బస్టాండ్‌లో అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ నరేంద్రరెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డిని ఎస్పీ అభినందించడంతో పాటు రివార్డ్స్ ప్రకటించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ విజయకుమార్ పాల్గొన్నారు.

అండర్-16 ఆంధ్రా జట్టుకు ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు ఎంపిక


ఆర్. సాత్విక్


జి.నవదీప్


వరుణ్ సాయి నాయుడు

అనంతపురం: అండర్-16 ఆంధ్రా క్రికెట్ జట్టుకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ముగ్గురు క్రికెటర్లు ఆర్.సాత్విక్, జి. నవదీప్, వరుణ్ సాయి నాయుడు ఎంపికయ్యారు. అనంతపురానికి చెందిన ఆర్.సాత్విక్ కుడి చేతి ఓపెనర్ బ్యాట్స్‌మెన్, కుడి చేతి లెగ్ స్పిన్నర్. మంచి ఆల్‌రౌండర్. అంతర్ జిల్లా మ్యాచ్‌ల్లో 269 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ ఉంది. 9 వికెట్లు తీశాడు. అనంతపురానికి చెందిన వరుణ్ సాయి నాయుడు కుడి చేతి లెగ్‌స్పిన్నర్, కుడి చేతి బ్యాట్స్‌మెన్. అంతర్ జిల్లా టోర్నీలో ఏకంగా 20 వికెట్లు తీశాడు. టీవీ చంద్రమోహన్‌రెడ్డి కోచ్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామానికి చెందిన జి.నవదీప్ కుడి చేతి మీడియం పేసర్, లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్.అంతర్ జిల్లా మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసిన అనుభవం ఉంది. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో ఈ నెల మూడో తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే టోర్నీలో వీరు పాల్గొంటారు. బీసీసీఐ లెవెల్-1 కోచ్ అయిన కె.నరేష్ అండర్-16 ఏపీ జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యాడు.

ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం సెంట్రల్: ఉమ్మడి జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. శనివారం అనంతపురంలోని కళ్యాణదుర్గం బైపాస్‌రోడ్డులోని రజాక్ ఫంక్షన్‌హాల్‌లో నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. అన్ని స్థానాలకూ పోటీ నెలకొనడంతో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడుగా చింతా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా రమేష్‌రంగయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గంగాధర్, సీకే రవి, కార్యదర్శులుగా అమర్‌నాథ్‌రెడ్డి, ముజీత్‌ఖాన్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఇతరనాయకుల సన్మానించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసులు పటిష్టబందోబస్తు నిర్వహించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

- 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎస్.శేఖర్, ఎస్‌ఐ రాంబాబు

రాప్తాడురూరల్: ఇళ్ల, షాపుల ముందు పార్క్ చేసిన బైకులను ఎత్తుకెళ్తున్న దొంగ ఆట కట్టించారు అనంతపురం రూరల్ పోలీసులు. బైకులను ఎత్తుకెళ్తున్న దొంగను శనివారం అరెస్ట్ చేశారు. వివరాలను రూరల్ పీఎస్ సీఐ ఎన్.శేఖర్ వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం కేఎస్ పాళ్యం గ్రామానికి చెందిన దేవరకొండ వేణు అలియాస్ ఎరుకల వేణు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. విలాసాలకు అలవాటు పడ్డ వేణుకు కూలిడబ్బులు ఏమాత్రం సరిపోవడం లేదు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సులభంగా డబ్బులు సంపాదించవచ్చని భావించాడు. ఈ క్రమంలో తండ్రితో కలిసి గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతూ పోలీసులకు పట్టుబడడంతో కనగానపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. 2022లో ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద వేణుతో పాటు మరో ముగ్గురు కలిసి ఒక ప్రేమజంటను బెదిరించి వారివద్ద ఉన్న డబ్బు, బంగారం, మొబైల్ ఫోన్లను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై ఆత్మకూరు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో జైలుకు వెళ్లొచ్చాడు. 2023లో అనంతపురం లక్ష్మీనగర్‌లో మరో ఇద్దరితో కలిసి ఒక వ్యక్తిని బెదిరించి మొబైల్ లాక్కున్నాడు. ఈ ఘటనపై నాల్గో పట్టణ పీఎస్‌లో కేసు నమోదై జైలుకు వెళ్లొచ్చారు. స్నేహితులతో కలిసి చేస్తున్న దొంగతనాల్లో పోలీసులకు పట్టుబడుతుండడంతో ఇకపై ఒక్కడే దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. అప్పటి నుంచి బైకులు ఎత్తుకెళ్లి వాటిని అమ్ముతూ, గుజిరికీ వేస్తూ సొమ్ము చేసుకుంటూ జల్సాలు చేస్తుండేవాడు. అనంతపురం నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇళ్ల ముందు, షాపుల ఎదుట నిలబెట్టిన బైకులను చాకచక్యంగా ఎత్తుకెళ్లేవాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. రూరల్ డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సీఐ శేఖర్ పర్యవేక్షణలో ఎస్‌ఐ రాంబాబు, సిబ్బంది వలపన్ని నిందితుడు దేవరకొండ వేణును శనివారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి కేఏ17 హెచ్‌బీ3071, టీవీఎస్ ఎక్స్‌ఎల్ టీఆర్ నంబరు టీఓ624 ఏపీ2206 ఏఎస్, ఏపీ02 ఏటీ7604, ఏపీ40 ఏఏ 0057 బైకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకున్న సిబ్బందిని ఎస్పీ జగదీష్ ప్రశంసించారు.

పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విష్ణువర్ధన్

అనంతపురం: జేఎన్‌టీయూ పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జేఎన్‌టీయూ (ఏ)లో ఈసీఈ విభాగం ప్రొఫెసర్‌గా ఉన్న డి.విష్ణువర్ధన్ నియమితులయ్యారు. పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతిని జేఎన్‌టీయూ అనంతపురానికి బదిలీ చేశారు. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌గా ఉన్న ప్రొఫెసర్ సురేష్‌బాబుకు అదనంగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న ప్రొఫెసర్ బి.ఈశ్వరరెడ్డికి స్పాన్సర్డ్ రీసెర్చ్ డైరెక్టర్‌గా నియమించారు. ప్రొఫెసర్ పద్మసువర్ణను ఐక్యూఏసీ డైరెక్టర్‌గా నియామకం చేశారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

పెనుకొండ రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపు నిర్వాహకుడిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సృజన్ బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రగిరి గ్రామానికి చెందిన నాగార్జున ఇంట్లోనే అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సోదాలు చేశారు. ఏడు మద్యం బాటిళ్లు దొరకడంతో నాగార్జునను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

పదోన్నతుల ప్రక్రియలో అసంబద్ధాలను తొలగించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం కార్పొరేషన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీ స్కూళ్లలో పని చేస్తున్న టీచర్ల పదోన్నతులకు సంబంధించి సీనియార్టీ జాబితా, ఖాళీల వివరాల్లో నెలకొన్న అసంబద్ధాలను తొలగించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డీఈఓ అందుబాటులో లేకపోవడంతో సూపరింటెండెంట్ ఆదినారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు మాట్లాడుతూ అనంతపురం కార్పొరేషన్, మునిసిపాలిటీలకు సంబంధించిన సీనియార్టీ జాబితాలోని పొరబాట్లపై ఇప్పటికే ఫిర్యాదులు చేశామని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. 2021లో మునిసిపల్ ఆర్డీ ఆధ్వర్యంలో పదోన్నతులు చేపట్టారని గుర్తు చేశారు. తర్వాత ఏర్పడిన ఖాళీలను రోస్టర్‌ను అనుసరించి భర్తీ చేయాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారు, పక్క జిల్లాలకు బదిలీ అయిన టీచర్ల పేర్లు సీనియార్టీ జాబితాలో ఉన్నాయని, వాటన్నింటినీ తొలగించి జాబితా తయారు చేయాలని డిమాండ్ చేశారు. డీఈఓ కార్యాలయ అధికారులను కలిసిన వారిలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి ఎస్.సూర్యుడు, నాయకులు అజయ్‌కుమార్, సుధాకర్, మల్లికార్జున, ప్రభాకర్, సురేష్‌కుమార్, రాజన్న, రమేష్, రామకృష్ణ, నరసింహులు ఉన్నారు.

బెల్టుషాపు పెట్టించి అరెస్టు చేయిస్తారా?

- టీడీపీ వార్డు అధ్యక్షుడు మరస హరి ఆవేదన

ధర్మవరం: 'పార్టీ కోసం కష్టపడిన నాకు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మద్యం బెల్టుషాపు ఇచ్చి గౌరవించారనుకున్నా.. కానీ పోలీసులతో అరెస్టు చేయిస్తారా' అంటూ ధర్మవరం పట్టణంలోని 26వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మరస హరి ఆవేదన వ్యక్తం చేశారు. బెల్టుషాపు పోయి.. ఉన్న డబ్బు పోయి అరెస్టవడాన్ని చూసి అందరూ నవ్వుకుంటున్నారని, ఈ అవమానం భరించలేకపోతున్నానంటున్న వీడియో శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. తెలుగుదేశం పార్టీని తన సర్వస్వంగా భావించి, తన కున్న సంపాదనలో కొంత మొత్తాన్ని పార్టీ కోసం ఖర్చుపెట్టానని పేర్కొన్నాడు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక నాతో పాటు మరో ఇద్దరికి బెల్టుషాపులు పెట్టుకోండని, ఎవ్వరూ ఏమీ అనరని చెబితే సరే అనుకున్నామన్నారు. బెల్టుషాపు పెట్టిన మూడు రోజులకే ఎక్సైజ్ పోలీసులు వచ్చి తనతో పాటు మరో ఇద్దరినీ అరెస్టు చేసి తీసుకెళ్లారన్నారు. ఇక్కడ జరిగిన విషయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌కు విన్నవించుకుందామంటే ఆయన వరకు వెళ్లనీయరు.. పోనీ కిందిస్థాయి నాయకులైనా కేసు నుంచి బయట పడేస్తారా అంటే ఫోన్ కూడా ఎత్తడం లేదని వాపోయారు. చివరకు కేసు నమోదు చేసి.. తమ వద్ద ఉన్న డబ్బు కూడా లాగేసుకున్నారని, ఈ పరిణామాలన్నింటినీ చూస్తున్న ఇతర రాజకీయ పార్టీల వారు నవ్వుకుంటున్నారని కన్నీటి పర్యంతమయ్యారు.

అంగన్‌వాడీ చదువులు అంతంతే!


పాత పుస్తకాలతో బోధిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


గత ప్రభుత్వంలో ఇచ్చిన పీపీ-1, పీపీ-2 కిట్లు


- ఐదు నెలలు అవుతున్నా అందని పుస్తకాలు
- పాత పుస్తకాలతోనే పాఠాలు

అగళి: విద్యాసంవత్సరం మొదలైౖదు నెలలు అవుతున్నా అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన పాఠ్యపుస్తకాలు అందలేదు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు పాత పుస్తకాలతోనే ప్రీస్కూల్ (పూర్వ ప్రాథమిక విద్య) బోధన చేస్తున్నారు. బాల్యదశ నుంచే చిన్నారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనేక చర్యలు చేపట్టారు. ఆటపాటలతో కూడిన విద్య, బొమ్మలున్న పుస్తకాలు అందజేసింది. దీంతో చిన్నారులు ఉత్సాహంగా అంగన్‌వాడీ బాట పట్టేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. పాత పుస్తకాలతోనే సరిపెట్టుకోవాలని అనధికార ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది చేసేదిలేక పాత పుస్తకాలతోనే పాఠాలు చెబుతున్నారు. జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,824 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలు 60,915 మంది, ప్రీస్కూల్ (3 నుంచి 6 సంవత్సరాలలోపు) పిల్లలు 38,003 మంది ఉన్నారు.

పుస్తకాలు అందుతాయో లేదో..!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీ విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ విద్యా సంవత్సరం ప్రారంభమైన జూన్ నెలలోనే 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలకు ఆంగ్లం, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-1, పీపీ-2 కిట్లు అందించారు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు బొమ్మలతో కూడిన పుస్తకాలను చూపిస్తూ చిన్నారులకు బోధించడం సులువుగా ఉండేది. పిల్లలు కూడా ఆసక్తిగా నేర్చుకునే వారు. అంగన్‌వాడీల్లో ఇంగ్లిష్ మాధ్యమంలో బోధన చిన్ననాటి నుంచే జరుగుతుండటంతో ఠంచనుగా అంగన్‌వాడీ కేంద్రాలకు తమ పిల్లలకు తల్లిదండ్రులు పంపించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో అంగన్‌వాడీల్లో బోధన మొక్కుబడి తంతుగా మారింది. కొత్త పుస్తకాలు ఇస్తారో..లేదోనన్న అనుమానంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు స్కూల్‌కు పంపేందుకు మొగ్గు చూపుతున్నారు.

పాత పుస్తకాలతో బోధిస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు ఇంకా రాలేదు. వచ్చిన వెంటనే ఆయా కేంద్రాలకు అందజేస్తాం. ప్రస్తుతం మా వద్ద ఉన్న పాత పుస్తకాలతోనే బోధిస్తున్నాం. టైం టేబుల్ ప్రకారం అన్ని స్కూళ్లలో చిన్నారులకు బోధన జరుగుతోంది. – నాగమల్లేశ్వరి, ఇన్‌చార్జ్ పీడీ, ఐసీడీఎస్

ఖాద్రీశా.. నమోనమః


క్యూలో వేచి ఉన్న భక్తులు

కదిరి టౌన్: ఓం నమో నారసింహా.. గోవిందా.. గోవింద అంటూ భక్తుల నామస్మరణతో కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రతిధ్వనించింది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు శనివారం ఆలయానికి తరలివచ్చారు. ఖాద్రీశుని దర్శించుకొని, తలనీలాలు సమర్పించారు. మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


ఆలయంలో వెలిగించిన కార్తీక దీపాలు